క్లుప్తంగా

మానవ హక్కులపై అవగాహన అవసరం

జఫర్‌గఢ్: మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆర్‌టీఐ హ్యూమన్‌రైట్స్ అడ్వకేసి సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుసుమ కవిత అన్నారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్య భవనంలో స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన ఆర్‌టీఐ హ్యూమన్‌రైట్స్ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో పౌరుల హక్కులకు భంగం కల్గించేలా ఎవరూ వ్యవహరించొద్దని అన్నారు. ముఖ్యంగా సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమల్ల సాంబరావు, జఫర్‌గఢ్, పాలకుర్తి మండలాల ప్రెసిడెంట్లు తాడెం కుమార్, సింగారపు దీపక్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

జనగామ రూరల్: కేవీపీఎస్ నూతన సంవత్సర డైరీని సోమవారం డీసీపీ కార్యాలయ ఆవరణలో డీసీపీ సీతారాం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తుటి దేవదానం, కార్యదర్శి బొట్ల శేఖర్, యాదగిరి, ఉప్పలయ్య, రమేష్, ప్రభాకర్, శోభ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

చిల్పూరు: గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని గ్రామ శాఖ అధ్యక్షుడు దార రాజు అన్నారు. మండలంలోని పల్లగుట్టలో సోమవారం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, మాజీ అధ్యక్షుడు మర్రి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా దార రాజు, ఉపాధ్యక్షుడిగా డి.స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఇసురం జగన్, కార్యదర్శిగా గుర్రపు శ్రీనివాస్‌లతో పాటు నర్సయ్య, వెంకటయ్య, కుంచాల యాదగిరి, మహేందర్, శ్రీను, రాజకుమార్, రమేష్, భిక్షపతి ఎన్నికయ్యారు.

పనులు పూర్తి చేయండి



బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్‌లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. సోమవారం ప్రాథమికోన్నత, సెకండరీ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ఈ పాఠశాలను మనఊరు– మనబడి కార్యక్రమంలో భాగంగా పైలెట్ పాఠశాలగా గుర్తించి అభివృద్ధి పనులను చేపడుతున్నారని తెలిపారు. పాఠశాలలో అన్ని వసతులను కల్పిస్తూ అవసరమైన అదనపు నూతన గదులను కూడా నిర్మిస్తున్నారని అన్నారు. అలాగే విద్యార్థులకు అనువైన క్రీడా మైదానాన్ని కూడా నిర్మిస్తున్నారని, ఈ నిర్మాణ పనులు పూర్తై త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాము, పంచాయతీ కార్యదర్శి రూపా చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోకేష్ జన్మదిన వేడుకలు



జనగామ: జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏపీ టీడీపీ అధినేత, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 40వ జన్మదిన వేడకలను ఘనంగా జరుపుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించారు. కాగా, పార్టీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ ఏపీలోని స్వగృహంలో లోకేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి ఎల్లేష్, బెడిదె మైసయ్య, భైరు బాబు, చీకట్ల నవీన్ గౌడ్, పరకాల శ్రీనివాస్ గౌడ్, సురుగు సతీష్‌గౌడ్, గడ్డం కృష్ణ, ఎండి ఎక్బాల్, బండపల్లి సోమేష్, సుద్దాల సురేష్, అన్వేష్, మామిడి యాదగిరి, మాచర్ల భిక్షపతి, చోటేమియా తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

రఘునాథపల్లి: వరకట్న వేధింపులపై ఓ మహిళ ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామ, ఆడపడుచులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరేందర్ సోమవారం తెలిపారు. లింగాలఘణపురం మండలం గుమ్మడివెల్లికి చెందిన సంగి మధుతో రఘునాథపల్లి మండలం కోమళ్లకు చెందిన శిరీషతో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్నాళ్లుగా భర్త, అత్తమామ, ఆడపడుచు అదనపు వరకట్నం కోసం శిరీషను వేదిస్తున్నారు. పలుమార్లు నిర్వహించిన పంచాయతీలో పెద్దమనుషులు నచ్చచెప్పినా ఫలితం లేదు. దీంతో శిరీష ఫిర్యాదు మేరకు భర్త మధుతో పాటు, అత్త భద్రమ్మ, మామ మల్లయ్య, ఆడపడుచు నాగమణిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



జనగామ రూరల్: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



జనగామ రూరల్: ఏబీవీపీ ఆధ్వర్యంలో..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో.. బీజేపీ నాయకులు



రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ పాత్ర ప్రత్యేకమైనదని అన్నారు. దేశ ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కలుగాలని ఎంతగానో కృషి చేసిన గొప్ప నేత సుభాష్‌చంద్రబోస్ అని ఆయన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ, ఏబీవీపీ, ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

దేశానికి ఆదర్శం 'కంటి వెలుగు'

రఘునాథపల్లి: అంధత్వ రహిత రాష్ట్రం కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న కంటి వెలుగు దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. సోమవారం రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న కంటి వెలుగు క్యాంపును ఆయన సందర్శించారు. స్టాల్స్‌ను పరిశీలించి శిబిరంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. తహసీల్దార్ అన్వర్, ఎంపీడీఓ హషీం, సర్పంచ్ గవ్వానివిజయనాగేశ్వర్, ఎంపీటీసీ కేమిడి రమ్యరాజు, పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్, మండల వైద్యాధికారి కమల హాసన్, వైద్యులు బిక్కునాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: రాష్ట్రంలో కంటి సమస్యతో ఎవరు బాధపడకూడదనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింద ఎమ్మెల్యే రాజయ్య తెలిపారు. మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం కంటి పరీక్షలు చేసుకున్న వారికి అద్దాలను అందజేశారు. ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, సర్పంచ్ బల్లెపు నర్సింగరావు, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, ఇల్లందుల స్రవంతి మొగిళి, వైస్ ఎంపీపీ కనకయ్య, మండల వైద్యాధికారి రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: కంటి అద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

బచ్చన్నపేట: మండలంలోని ఆలింపూర్, బచ్చన్నపేటలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా సోమవారం మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ ఆలింపూర్‌లో 123 మంది, బచ్చన్నపేటలో 160 మంది కంటి పరీక్షలు చేసుకున్నారని తెలిపారు. దశల వారిగా అన్ని గ్రామాల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అనిల్‌రాజ్, రేవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఆలింపూర్‌లోని శిబిరాన్ని రాష్ట్ర కంటివెలుగు క్వాలిటీ అబ్జర్వర్ ఆశాజ్యోతి సందర్శించారు.

అద్దాల పంపిణీ

దేవరుప్పుల: మండల కేంద్రంతోపాటు ధర్మాపురంలో కంటివెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. రెండు గ్రామాల్లోని శిబిరాలకు 321 మందికి కంటీ పరీక్షలు నిర్వహించి అవసరార్థులైన 89 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రమాదేవి, అశోక్, డాక్టర్లు యేల అనిల్‌కుమార్, మనోజ్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మారపాక రవి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ కందుల రేఖగట్టయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా రవి హాజరయ్యారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను సభలో వినిపించారు. వైద్య ఆరోగ్యశాఖ నివేదికను ఘన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సంధ్య తెలుపుతుండగా ఎంపీటీసీలు పురమాని రజాక్‌యాదవ్, గన్ను నర్సింహులు మాట్లాడారు. ఆస్పత్రిలోసేవలు తూతూమంత్రంగా మారాయని, కేవలం ఓపీతోనే సరిపెడుతున్నారన్నారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ ఉన్నా తీయడం లేదని, దాంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు డాక్టర్ స్పందిస్తూ ఎక్స్‌రే మిషన్ ఉన్నప్పటికీ టెక్నీషియన్ లేరని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల్ని ప్రజాప్రతినిధులు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, ఎంపీడీఓ కృష్ణ, ఎంపీఓ సుధీర్, కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పేరిట ఇసుక దందా తగదు

దేవరుప్పుల : అభివృద్ధి పనుల పేరిట ఇసుక దందా తగదని గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి గోల గంగారావు అన్నారు. సోమవారం కోలుకొండ వాగు నుంచి మాధాపురం డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనుల అనుమతుల పేరిట ఇసుక రవాణా చేస్తుండగా కాంగ్రెస్ యూత్ మండల నాయకుడు దామెర అనిల్, ఎస్సీ సెల్ నాయకుడు గనుపాక ఆగయ్యతో కలిసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక వనరులను పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల పేరిట విచ్చలవిడిగా ఇసుక ఖాళీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతు ఆదాయంపై పన్ను వేయొద్దు



కొడకండ్ల: రైతు ఆదాయంపై కేంద్ర ప్రభుత్వం పన్ను వేయాలని కుట్రలు పన్నుతుందని, పన్ను వేస్తే సహించబోమని బీఆర్ఎస్ నాయకులు సోమవారం గిర్నితండ వద్ద నిరసన వ్యక్తం చేసి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ దేశ్‌రాయ్ కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే ఈ దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్‌గాంధీనాయక్, ఆర్ఎస్ఎస్ కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ రాజ్‌కుమార్, నాయకులు నరేష్, శ్రీను, తుకారాం, సుధాకర్, శ్రీరాంగాంధీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రఘునాథపల్లి: మండలంలోని కోమళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు అప్పటి గురువులను సన్మానించారు. అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. సర్పంచ్ శంకరి అనిత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎంతిచ్చినా తక్కువే

జనగామ: విద్యాబుద్ధులు నేర్పి.. ప్రపంచంలో తనకంటూ ఓ గుర్తింపు తీసుకువచ్చిన ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎంతచేసినా తక్కువే అని ఎన్‌ఆర్‌ఐ, ప్రముఖ గుండె వైద్య నిపుణులు, చొల్లేటి యశోదరెడ్డి ట్రస్ట్ చైర్మన్ చొల్లేటి రాజనరేందర్ రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం వి.కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన 2021–22లో ప్రతిభ కనబరిచిన పదో తరగతిలో విద్యార్థుల సత్కార సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2010–11 నుంచి పదిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం 2021–22లో ప్రతిభ కనబరిచిన 8 మంది 10వ తరగతి విద్యార్థులకు మూడు కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో ఒక్కొక్కరికి రూ.7వేలు, రూ.6వేలు, రూ.5వేల చొప్పున రూ.50వేలు నగదుతో పాటు మెమొంటోలను అందించారు. పూర్వ విద్యార్థిని ప్రీతి, ఎస్‌ఎంసీ చైర్మన్ బి. సత్యనారాయణ తదితరులు పాన్నారు.



విద్యార్థులతో ఎన్‌ఆర్‌ఐ రాజనరేందర్‌రెడ్డి

స్వయం పరిపాలనతో నాయకత్వ లక్షణాలు

దేవరుప్పుల : స్వపరిపాలనతో విద్యార్థుల భవిష్యత్ జీవితంలో వ్యవహరించాల్సిన కుటుంబ, సమాజ నాయకత్వపు లక్షణాలు వస్తాయని సర్పంచ్ వంగ పద్మవెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం చిన్న మడూరు హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవం హెచ్‌ఎంగా దేవర సందీప్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యతోపాటు మిగితా రంగాల్లో రాణించినప్పుడే జీవితంలో ఆశించిన లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. స్వపరిపాలన దినోత్సవంలో ఆర్‌జేడీగా గైని నిత్య, డీఈఓగా ముషిగుంపుల సుశాంత్ తదితరులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు సుజాతమల్లిఖార్జున్, హెచ్‌ఎం ఈదునూరి రవీందర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ఘన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎండీ.అజామొద్దీన్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా ఎఫ్‌ఏ పోస్టు ఖాళీ

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లలో ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు సుమారు నాలుగేళ్లుగా ఖాళీగానే ఉంది. గతంలో పని చేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడని, ప్రైవేట్‌గా మరో ఉద్యోగం చేస్తున్నాడనే ఫిర్యాదులతో అతన్ని తొలగించారు. అప్పటి నుంచి మరో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేదు. మండలంలోనే అతి పెద్ద గ్రామ పంచాయతీయే కాకుండా జిల్లాలోనే ఉత్తమ పల్లె ప్రకృతి వనంగా పేరొందిన నెల్లుట్లలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేకపోయారు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సీఎంఓ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు పల్లె ప్రకృతి వనంపై గొప్పలు చెప్పడమే కాని కనీసం ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేకపోతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ఉపాధి హామీ కూలీల జాబ్ కార్డులకు ఆధార్ లింక్ చేయడంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేక ఇబ్బంది పడుతున్నారు. సీనియర్ మేట్ శ్రీనివాసుతోనే పని చేయించడం జరుగుతుంది. ఈ విషయంపై సర్పంచ్ స్వరూపరాణిని వివరణ కోరగా గ్రామ పంచాయతీ నుంచి నెలకు రూ.8,500 చెల్లించి సీనియర్ మేట్‌తో పని చేయిస్తున్నామని, ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని పంచాయతీలో తీర్మానం చేసి పంపించామని, అధికారులు ఎప్పుడు నియమిస్తారో వేచి చూస్తున్నామని చెప్పారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

జనగామ: అభివృద్ధి, సంక్షేమంపై గానుగుపహాడ్ ప్రజలు అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పకుండా కాంగ్రెస్ నాయకులను దూషించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే హోదాలో గ్రామానికి వెళ్లిన ఆయనకు ప్రజలు సమస్యలు చెప్పుకుంటే.. పరిష్కరిస్తారో సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ నాయకులు, పార్టీని తిట్టడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే మాటలను ఖండిస్తున్నాం...

గౌరవ ప్రదమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రతిపక్ష పార్టీల పట్ల అసభ్యంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సోమవారం ప్రకటనలో వెల్లడించారు. ఎమ్మెల్యే 24 గంటల్లో కాంగ్రెస్ పార్టీకి క్షమాపణ చెప్పాలన్నారు. అధికారంలో ఉన్న నేతలు ప్రజల పక్షాన నిలబడకుండా.. ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. బీఆర్ ఎస్ పార్టీని గ్రామాల్లో తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు.

అనవసరంగా దూషిస్తే ఊరుకోబోం

బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ నాయకుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వంచ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఆత్మ గౌరవంతో బతుకుతున్నారని, అలాంటి వారిని అనవసరంగా దూషిస్తే ఊరుకోబోమని అన్నారు. నాయకులు శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, రమేష్, మల్లేష్, రాజయ్య, ఎల్లయ్య, శ్రీనివాస్, నర్సిరెడ్డి, రవి, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కారోబార్లు

రఘునాథపల్లి: సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ సిబ్బంది తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి సోమవారం మండలంలోని పలు గ్రామాల కారోబార్లు, బిల్ కలెక్టర్లు హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు ఉమ్మగోని రాజేష్ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మేజర్ గ్రామపంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలపై వెంటనే విచారణ జరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల పక్షం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎమ్మెల్యే రాజయ్యకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు సింగిల్ విండో వైస్ చైర్మన్ మొగిళిపాక నర్సింగం, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, ఇల్లందుల స్రవంతి మొగిళి, సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు రాపర్తి సోమయ్య, జువారి రమేష్, వార్డు సభ్యులు కాట సుధాకర్, కుక్కల ఎల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎస్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

చేయూత

పాలకుర్తి టౌన్: దర్దేపల్లికి చెందిన గిరగాని యాదగిరి గౌడ్ తాటి చెట్టు పైనుండి పడి మృతి చెందాడు. కాగా, సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న మెమోరియల్ ట్రస్ట్ నుంచి ఆర్థిక సహాయం చెక్కును ట్రస్ట్ చైర్మన్ తాళ్లపల్లి రామస్వామి, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగన్న బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

అవగాహన కల్పించాలి

చిల్పూరు: పాఠశాలలో వారంలో ఒక రోజు ప్రతీ విద్యార్థికి బ్లాక్ బోర్డుపై విద్యాబోధన చేసే అవకాశాన్ని కల్పిస్తే విద్యపట్ల మరింత అవగాహన పెరుగుతుదని ఏఎంఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని

సంక్షిప్త సమాచారం

ఫత్తేపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఏఎంఓతో పాటు సీఆర్‌పీ రవీందర్ సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సరోజనతో కలిసి తరగతి గదులను పరిశీలించారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

బచ్చన్నపేట: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామస్తులు సహకరించాలని మన్‌సాన్‌పల్లి సర్పంచ్ పంజాల తార అన్నారు. సోమవారం గ్రామంలోని జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులు తమ ఇంటి, నల్లా పన్నులను సకాలంలో చెల్లించాలన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ సేవలు మరువలేనివి

బచ్చన్నపేట: సీపీఐ సీనియర్ నాయకుడు మల్లం లక్ష్మీనారాయణ సేవలు మరువలేనివని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంగళంపెల్లి జనార్దన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో లక్ష్మీనారాయణ 4వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ లక్ష్మీనారాయణ పార్టీ కోసం తన జీవితాన్నే త్యాగం చేశాడన్నారు. ఆయన స్మారక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

క్రీడాకారుడికి సన్మానం

పాలకుర్తి టౌన్: జాతీయ స్థాయి కబడ్డీలో ప్రతిభ కనబర్చిన మండలంలోని వల్మిడికి చెందిన క్రీడాకారుడు ఓరుగంటి సురేష్‌ను సోమవారం మండలంలోని చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పోతుగంటి నర్సయ్య మాట్లాడుతూ కబడ్డీ ఆటలో రాణిస్తున్న సురేష్ గ్రామానికి, మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసకువస్తున్నట్లు తెలిపారు. అలాగే కబడ్డీ క్రీడాకారులు బాలబోయిన నరేష్, నవీన్, శ్రీనివాస్‌ను సన్మానించారు.

వ్యక్తిత్వవికాసంపై విద్యార్థులకు శిక్షణ

జఫర్‌గఢ్: మా ఇల్లు సంస్థ, మోటివేటర్ స్పీకర్ జంగం శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వవికాసంపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేటర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ, పట్టుదల అవసరమన్నారు. చదువుతోపాటు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గణేష్‌రెడ్డి, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ గాదె పుష్పారాణి, మా ఇల్లు సంస్థ తరఫున పూజిత, కారుణ్య, చిరంజీవి, విజేత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కొడకండ్ల: నర్సింగాపురం గ్రామ మాజీ సర్పంచ్, స్వాతంత్ర్య సమరయోధుడు గోపాల్‌దాస్ ఎల్లయ్య ఆదివారం రాత్రి మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు సతీష్‌గౌడ్, లింగయ్య, యాదగిరి, సోమనర్సయ్య, రవిందర్, రమేష్ ఎల్లయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

పేదలకు 120 గజాల స్థలం ఇవ్వాలి

పాలకుర్తి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు 120 గజాల స్థలం కేటాయించి, ఇంటిని నిర్మించి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ సత్యం డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐలమ్మ స్మారక భవనంలో ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పద్మ, నరేష్, కొమురయ్య, రమేష్, కుమార్, అంజమ్మ సోమనర్సయ్య పాల్గొన్నారు.

ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్‌కు ఫస్ట్ బెస్ట్ రూరల్ క్లబ్ అవార్డుతో పాటు వివిధ అంశాల్లో మొత్తం 22 అవార్డులు వచ్చాయని క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, కార్యదర్శి ఆమంచ మధుసూధన్ తెలిపారు. డివిజన్ కేంద్రంలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. హనుమకొండలో ఆదివారం జరిగిన లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశంలో ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఫస్ట్ బెస్ట్ రూరల్ క్లబ్ అవార్డుతో పాటు ఫస్ట్ బెస్ట్ కార్యదర్శిగా ఆమంచ మధుసూధన్‌కు, సెకండ్ బెస్ట్ కోశాధికారిగా నాయిని విజయ్‌చందర్‌కు అవార్డులు వచ్చినట్లు చెప్పారు. అలాగే పలు అంశాల్లో ఉత్తమంగా నిలిచి 22 అవార్డులను అందుకున్నట్లు చెప్పారు. అవార్డులతో బాధ్యత మరింత పెరిగిందని, సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృతం చేస్తామని అన్నారు.



అవార్డులతో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణాల మధ్య గణపతి పూజ, పుణ్యహావచనం తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు పెద్ద ఉపేందర్, ఆలయ ట్రస్ట్ చైర్మన్ లగిశెట్టి బిక్షపతి, సిద్దేశ్వర్, శంకర్‌లింగం, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి


రఘునాథపల్లి: మండల కేంద్రంలోని రెండో వార్డు మురికి కూపంగా మారిందంటూ స్థానికులు సోమవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌ని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని, మురుగు కాల్వలు నిండి అపరిశుభ్ర వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. అధికారులు అభివృద్ధి పనులకు సంబంధించి రూపొందించే ప్రణాళికలను సర్పంచ్ అమలు చేయకుండా ఇష్టానికి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. గ్రామాన్ని సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్య తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. తమ వినతికి అదనపు కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డీపీఓ, ఎంపీఓలను ఆదేశించినట్లు ఫిర్యాదు దారులు తెలిపారు.

సమస్యలు లేకుండా చూస్తాం..



బచ్చన్నపేట: గ్రామంలో సమస్యలు లేకుండా చూస్తామని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మండలంలోని కట్కూర్ సర్పంచ్ మూసిని సునీత అన్నారు. సోమవారం గ్రామంలోని హైటెక్ వార్డును సందర్శించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ప్రతీ సోమవారం గ్రామంలోని వార్డులను సందర్శించి ఆయా గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని అన్నారు. గ్రామాభివృద్ధికి గ్రామస్తులు కూడా సహకరించాలని కోరారు. ప్రశాంత్ ఆచార్య, శైలజ, ఐలయ్య, రాజు, సత్తయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



దేవరుప్పుల : ప్రజారోగ్య సంరక్షణ కోసం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రవేశ పెట్టిన 108 అంబులెన్స్‌లో ఓ మహిళ పండంటి బిడ్డకు సోమవారం జన్మనిచ్చింది. లింగాలఘనపురం మండలం చీటూరుకు చెందిన జి.మమత తమ పుట్టినిల్లైన నీర్మాలలో ఉండగా పురిటినొప్పులు రావడంతో భర్త మనోజ్ అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. కాన్పుకోసం చంపక్‌హిల్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే బాబుకు జన్మనిచ్చింది. కాగా, ఈఎంటీ బిల్లా రాజు, పైలెట్ చిన్నకుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.